ఈనాడు బాపట్ల

గురువారం అక్టోబరు 3, 2024



అద్దంకి: కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద దీపాలంకరణ

‘శ్రీమన్నారాయణి’గా చందోలు బండ్లమ్మ

చందోలు శ్రీబండ్లమ్మ అమ్మవారికి భాద్రపద అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అస్త్రశస్త్రాలకు అధిపతి అయిన ‘శ్రీమన్నారాయణి’గా అమ్మవారు దర్శనం ఇచ్చారు. దసరా సందర్భంగా జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలతో అలంకరించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సామూహిక కుంకుమార్చనలు, చండీ హోమం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల వద్ద అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది.

- చందోలు (పిట్టలవానిపాలెం), అద్దంకి, న్యూస్‌టుడే



అలంకరణలో బండ్లమ్మ అమ్మవారు

నేటి నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

గుంటూరు: రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పీడీపీ, పీడీఐ నిర్వహణపై రెండో విడతలో అధికారులకు మూడు రోజుల శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. జిల్లాపరిషత్తు సమావేశ మందిరంలో గురువారం ఉదయం పది గంటలకు శిక్షణ ప్రారంభించనున్నారు. డీఎల్‌పీవోలు, మండలాల ఎంపీడీవోలు, ఈవోఆర్‌డీలు శిక్షణ కార్యక్రమానికి హాజరవ్వాలని జడ్పీ సీఈవో జ్యోతిబసు ఉత్తర్వులు జారీ చేశారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తులు శూన్యం

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో 117 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయటానికి రెండేళ్ల లైసెన్స్‌ల జారీకి నోటిఫికేషన్ వెలువడి 24 గంటలు గడిచినా ఒక్క దరఖాస్తు రాలేదు. దుకాణాల లైసెన్స్‌లకు ప్రభుత్వం సోమవారం అర్ధరాత్రి నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో గెజిట్ నోటిఫికేషన్ మంగళవారం రాత్రి విడుదల చేశారు. మంగళ, బుధవారాలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు రాలేదు. గాంధీ జయంతి, బ్యాంకులకు సెలవు, అమావాస్య కావటంతో ఎవరూ దరఖాస్తులు అందజేయలేదు. నాన్‌రిఫండబుల్ రుసుం డీడీతో వచ్చే వారి కోసం జిల్లాలోని ఏడు అబ్కారీ స్టేషన్లలో ఆన్‌లైన్లో దరఖాస్తులు చేయించటానికి ప్రతి స్టేషన్‌కు ఇద్దరు డిజిటల్ సహాయకులను కలెక్టర్ కేటాయించారు. గురువారం నుంచి మద్యం దుకాణాల లైసెన్స్‌లకు దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ శాఖాధికారులు భావిస్తున్నారు. చాలా చోట్ల పట్టణాలు, మండలాల్లో ఒకే లైసెన్స్ ఫీజు ఉండటంతో వ్యాపారులు దరఖాస్తులు ఎక్కడ వేయాలని ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నారు.

పులిచింతలలో మొసలి



వంతెన పైభాగంలో సంచరిస్తున్న మొసలి

అచ్చంపేట (క్రోసూరు), న్యూస్‌టుడే: పులిచింతల ప్రాజెక్టు వంతెనపై బుధవారం తెల్లవారుజామున మొసలి ప్రత్యక్షం కావడంతో కలకలం రేగింది. మూడు నెలల నుంచి ప్రాజెక్టుకు భారీ నీరు చేరుకోవడంతో మొసలి ఎగువ ప్రాంతం నుంచి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. ప్రాజెక్టు వంతెనపై తెలంగాణ, ఆంధ్ర ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వారంతా భయభ్రాంతులకు గురయ్యారు.

కుందేరు వాగు..
కనుమరుగు

పూడ్చి వేసి లేఔట్లలో కలిపేసి..

కబ్జాలను ప్రోత్సహించిన నాటి వైకాపా పెద్దలు

జిల్లా కేంద్రానికి తప్పని ముంపు ముప్పు

బాపట్ల, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రం బాపట్ల ముంపు బారినపడకుండా బ్రిటీషర్ల కాలంలో తవ్విన కుందేరు వాగు అక్రమార్కుల కబ్జా కోరల్లో చిక్కుకుంది. స్థిరాస్తి వ్యాపారులు వాగును పూడ్చి వేసి లేఔట్లలో కలిపేసుకున్నారు. అక్రమ లేఔట్లకు రహదారులు వేశారు. వ్యవసాయదారులు తమ భూముల్లో కలిపేసుకున్నారు. వైకాపా పాలనలో వాగు పోరంబోకు భూమిలో ఇసుక, బుసక అక్రమ తవ్వకాలు చేపట్టారు. ఆక్రమించి చేపల చెరువులుగా మార్చారు. వరద నీరు సముద్రంలోకి ప్రవహించే కీలకమైన వాగు కనుమరుగు కావడంతో ప్రజలకు ముంపు ముప్పు ఎదురవుతుంది. ఆక్రమణలు తొలగించి వాగును పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

బాపట్ల మండలంలో పడమర బాపట్ల నుంచి ప్రారంభమయ్యే కుందేరు వాగు చీరాల, వేటపాలెం మండలాల మీదుగా చినగంజాం మండలం వరకు 35 కి.మీ. దూరం ప్రవహిస్తుంది. స్టూవర్టుపురం. వెదుళ్లపల్లి వద్ద వాగును ఆక్రమించి సారా తయారీ బట్టీలు ఏర్పాటు చేశారు. 30 మీటర్ల ఉండే వాగు అక్రమ తవ్వకాలతో 10 మీటర్లకు కుచించుకుపోయింది. వెదుళ్లపల్లి, పడమర బాపట్లలో వాగును అక్రమంగా పూడ్చివేసి పంట పొలాలు, అక్రమ లేఔట్లలో కలిపేసుకున్నారు. గత వైకాపా పాలనలో వాగు పోరంబోకు భూమిని కబ్జా చేశారు. ఇసుక, బుసక తవ్వేసి చేపల చెరువులుగా మార్చి వేశారు. వైఎస్‌నగర్ వద్ద వాగును కొంత పూడ్చి అక్రమ లేఔట్లకు వెళ్లడానికి రహదారిని నిర్మించారు.



ఆక్రమణలతో వాగు ఇలా..



సుబ్బారెడ్డిపాలెం వద్ద కుందేరు వాగు ఆక్రమించి వేసిన అక్రమ లేఔట్

స్వయంగా గుర్తించిన కలెక్టర్

వరదలు వస్తే నీరు కుందేరు వాగు ద్వారా పేరలి, ఈపూరుపాలెం, వేటపాలెం మురుగు కాలువల్లో కలిసి బాపట్ల పట్టణంతో పాటు పడమర బాపట్ల, ఆసోదివారిపాలెం, పోతురాజుకొత్తపాలెం, వెదుళ్లపల్లి, కావూరివారిపాలెం, స్టూవర్టుపురం ముంపు బారినపడకుండా ఉంటాయి. వేల ఎకరాల్లో పంటలు మునిగిపోకుండా ఉండేలా వాగును తవ్వారు. ఆక్రమణల కారణంగా వాగు కుచించుకుపోయింది. భారీ వర్షాలు కురిస్తే వరద నీరు బయటకు వెళ్లే అవకాశం లేదు. బాపట్ల పట్టణంతో పాటు, గ్రామాలు వరదకు తీవ్రంగా ప్రభావితం అవుతాయి. తీర ప్రాంతానికి తుపాన్ల ముప్పు ఎక్కువ. తుపాను వస్తే భారీగా పంట నష్టం జరుగుతుంది. కలెక్టర్ వెంకట మురళి ఇటీవల కుందేరు వాగుపై వెదుళ్లపల్లి-కావూరివారిపాలెం మార్గంలో శిథిలావస్థలో ఉన్న వంతెనను పరిశీలించారు. ఆ సమయంలో వాగు భూమి ఆక్రమణలకు గురైన వైనాన్ని ఆయన స్వయంగా గుర్తించారు. వాగు పోరంబోకు భూమిని వ్యవసాయ భూముల్లో కలిపేసుకోవడాన్ని గమనించారు. సర్వే చేసి ఆక్రమణలు తొలగించి సరిహద్దు రాళ్లు వేయాలని బాపట్ల తహశీల్దారును ఆదేశించారు. అయితే సర్వే ఇంకా ప్రారంభించలేదు.

సర్వే చేసి సరిహద్దులు గుర్తించాలని కోరాం

కుందేరు వాగు ఆక్రమణలకు గురైన మాట వాస్తవమే. సర్వే చేసి సరిహద్దులు గుర్తించి ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ అధికారులను కోరాం. అక్రమ తవ్వకాలను అడ్డుకుంటాం. వాగులో పూడిక తీత పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు చేయగానే పనులు ప్రారంభిస్తాం.

- మురళీకృష్ణ, మురుగు నీటిపారుదల శాఖ ఈఈ

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సత్యాగ్రహ దీక్షలో ఉపాధ్యాయులు

చీరాల, న్యూస్‌టుడే : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం పురపాలక సంఘం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇతర యాజమాన్యాల ఉపాధ్యాయులు పొందే అన్ని సౌకర్యాలు మునిసిపల్ ఉపాధ్యాయులకు వర్తింపజేస్తూ జీవో 84 విడుదల చేశారన్నారు. 2022లో ఇది అమలులోకి వచ్చినా నేటికి సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి, బిక్షాలు బాబు, పి.సురేష్, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు
గంటకుపైగా రైళ్ల రాకపోకలకు అంతరాయం



చుండూరు వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

చుండూరు, న్యూస్‌టుడే: విజయవాడ - చెన్నై రైలు మార్గంలో ప్రయాణిస్తున్న గూడ్స్ రైలు చుండూరు రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం పట్టాలు తప్పింది. రైల్వే పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం విజయవాడ నుంచి బాపట్ల వైపు బియ్యం లోడుతో వెళుతున్న గూడ్స్ రైలు చివరి బోగీ చుండూరు సమీపంలో పట్టాలు తప్పింది. దీంతో పరిస్థితిని గమనించిన రైల్వే గార్డ్ వెంటనే డ్రైవర్‌ను అప్రమత్తం చేయగా, అతను గూడ్స్‌ను నిలుపుదల చేసి, రైల్వే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి వెంటనే సిబ్బందితో మరమ్మతులు చేయించి గూడ్స్ రైలును అక్కడి నుంచి బాపట్ల వైపు పంపారు. గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో దాని వెనకే ఈ మార్గంలో నడిచే 22807 సత్తర్‌గంజి-చెన్నై, హైదరాబాద్ - తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్లను తెనాలి స్టేషన్‌లో నిలిపేశారు. మరమ్మతుల అనంతరం యథావిధిగా ఆ మార్గంలో రైళ్లు నడిచాయి. గంటపైగా రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోండి

గుంటూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవో, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఓటరు దరఖాస్తు ఫారం-18 పూర్తి చేసి.. విద్యార్హతలకు సంబంధించిన నకళ్లు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. రెండు ఉమ్మడి జిల్లాల్లో 188 సహాయ ఓటరు నమోదు అధికారులు, 104 డిజిగ్నేటెడ్ అధికారులు, 119 అదనపు డిజిగ్నేటెడ్ అధికారులు అందుబాటులో ఉన్నారన్నారు. పట్టభద్రులు నవంబరు 6వ తేదీలోపు ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చెప్పారు.

చేనేతను రక్షించుకుందాం



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు, చేనేత కార్మికులు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: గాంధీ జయంతి పురస్కరించుకుని స్థానిక రథం సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో ప్లకార్డులతో కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. చేనేత పరిశ్రమను రక్షించి విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.బాలాజీ మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యంగా ఉండి పరిశ్రమను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పరిశ్రమకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ల చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్‌పై తయారవుతున్న వస్తువులను విడనాడి మగ్గాలపై తయారయ్యే వస్త్రాలను ధరించాలని కోరారు. కార్యక్రమంలో చేనేత నాయకులు దీపాల సత్యనారాయణ, భట్టు నాగమల్లేశ్వరరావు, కె.వీరమోహనరావు, కార్మికులు పార్థసారథి, అడిగోపుల ప్రసాద్, జె.నాగభూషణం, ఆకురాతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మిర్చితో ఏమార్చి!

✶ అడ్డదిడ్డంగా జీడీసీసీబీ రుణాలు ✶ గడువు దాటినా వసూలు కాని బకాయిలు

ఈనాడు, అమరావతి



శీతల గోదాముల్లో నిల్వ చేసిన మిర్చికి బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో వసూలు కావడం లేదు. పైగా తనఖా పెట్టిన మిర్చి బస్తాలు మాయం కావడంతో ఆ బకాయి వసూలు చేయడం బ్యాంకర్లకు తలకుమించిన భారమవుతోంది. ఇందులో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వాటా ఎక్కువగా ఉండడం గమనార్హం. గోదాముల యజమానుల్లో కొందరు నకిలీ బాండ్లు సృష్టించి వారికి తెలిసిన వ్యక్తులను రైతులుగా చూపించి రుణాలు పొంది సొంతానికి వాడుకున్నారు. మిర్చి నిల్వ చేసి తీసుకున్న రుణాలకు ఏడాది కాల వ్యవధి ఉంటుంది. ఈ గడువు ముగిసినా బకాయిలు వసూలుకాని పక్షంలో మిర్చిని వేలం వేసి సొమ్ము రాబట్టుకునే అవకాశం బ్యాంకర్లకు ఉంది. అయితే మిర్చి నిల్వలు బ్యాంకుకు తెలియకుండా అమ్ముకోవడం, మరో బ్యాంకుకు ఆ నిల్వలు చూపించి రుణాలు తీసుకోవడంతో వాటిని వేలం వేసే పరిస్థితి ఉండడం లేదు.

జీడీసీసీబీ నల్లపాడు బ్రాంచి ఇచ్చిన రూ. 116 కోట్ల రుణాల్లో మూడు నెలల వ్యవధిలో ఇచ్చినవే ఎక్కువగా ఉన్నాయి. ఈ శాఖ పరిధిలో రూ. 25 కోట్లకు సంబంధించి ఇప్పటికే ఏడాది గడువు పూర్తయింది. మరో రూ. 15 కోట్లకు ఏడాది గడువు పూర్తికావడానికి కొన్ని రోజుల సమయం ఉంది. ఈ శాఖ పరిధిలో బకాయిలు పెరుగుతుండడం, సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో బ్యాంకు ఉన్నతాధికారులు ప్రతివారం రుణాల రికవరీ వేగవంతం చేయాలని సూచిస్తున్నారు. బకాయిలు వసూలు కాని పక్షంలో సంబంధిత మిర్చిని వేలం వేయాలని చెబుతున్నా.. ఆ దిశగా అడుగులు పడడం లేదు. రాఘవేంద్ర శీతలగోదాములో నకిలీ బాండ్లు పెట్టి రుణాలు పొందారు. ఇందులో నల్లపాడు బ్రాంచికు రూ. 4 కోట్ల బకాయి వసూలు కావాల్సి ఉంది. గోదాములోని మిర్చిలో కొంత ఇప్పటికే విక్రయించడం, మరో బ్యాంకులోనూ బాండ్లు పెట్టి రుణాలు పొందినందున జీడీసీసీబీకి చూపిన బస్తాలు ఉన్నాయా? లేవా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలో శీతల గోదాముల్లో మిర్చి నిల్వ చేసిన రైతులకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీబీ) ఇచ్చిన రుణాలు	రూ. 164 కోట్లు
ఇందులో ఒక్క నల్లపాడు శాఖ ఇచ్చిన మొత్తం...	రూ. 116 కోట్లు
జిల్లావ్యాప్తంగా జీడీసీసీబీకి పేరుకుపోయిన బకాయిలు...	రూ. 53 కోట్లు
ఒక్క నల్లపాడు శాఖ పరిధిలోని బకాయిలే ఏకంగా	రూ. 40 కోట్లు

కొరవడిన పర్యవేక్షణ

నల్లపాడు బ్రాంచి పరిధిలో ఒక్కో రైతు పేరు మీద గరిష్ఠంగా రూ. 10 లక్షల రుణమిచ్చారు. ఇంత పెద్దమొత్తంలో ఇచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో అంతా పక్కాగా ఉందా? లేదా? అన్నది బ్యాంకు ఉన్నతాధికారులు తనిఖీ చేసి ఉంటే నిబంధనలు పక్కాగా అమలయ్యేవి. బ్యాంకు విశ్రాంతి ఉద్యోగి ధ్రువీకరణ ఆధారంగా రుణాలిచ్చేయడం గమనార్హం. గోదాములకెళ్లి సరకు ఉందా? లేదా? ఇతర బ్యాంకుల్లో తనఖా పెట్టారా? బాండ్లు నకిలీవా? అసలువా? రైతులే రుణాలు తీసుకుంటున్నారా? వంటి అంశాలు పక్కాగా పరిశీలించకుండానే రుణాలు మంజూరు చేశారు.

అక్రమాలు జరుగుతున్నాయని ఆపేసినా..

జీడీసీసీబీ నుంచి రుణాలిచ్చిన ప్రతిసారీ సొమ్ము పక్కదారి పడుతోంది. గతంలో రెండు సార్లు ఇలా వివాదాస్పదం కావడం, రూ. 1.35 కోట్లకుపైగా ఇప్పటికీ వసూలు కాకపోవడంతో ప్లెడ్జ్ రుణాలివ్వడం ఆపేశారు. వైకాపా గద్దెనెక్కాక సొసైటీ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేట్ చేసి చేతులు దులిపేసుకుంది. వీరు బ్యాంకు యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి గత మూడేళ్లుగా ప్లెడ్జ్ రుణాలు మంజూరు చేయించారు. ఆ బకాయిలే బాగా పేరుకుపోయాయి. వైకాపా నేతల అనాలోచిన నిర్ణయం బ్యాంకు పాలిట శాపంగా మారింది.

తీరంలో అక్రమ తవ్వకాలు


ట్రాక్టర్‌లో బుసక పోస్తున్న జేసీబీ

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల-చీరాల మండలాల సరిహద్దుల్లోని భూముల్లో ఇసుక, బుసక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. భవన నిర్మాణ రంగంలో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కొత్త వాడరేవు, రామచంద్రాపురం వద్ద ఇసుక భూముల్లో యంత్రాల ద్వారా కొందరు అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.6 వేలకు, బుసకను రూ.3 వేలకు విక్రయిస్తున్నారు. ఈ తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. చీరాల మండలం దేవినూతల, పుల్లాయపాలెం, విజయలక్ష్మీపురం ప్రాంతంలో తవ్వకాలు చేస్తూ తెల్లవారుజామున ట్రాక్టర్లలో ఇసుక తరలించి విక్రయిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు ఆకస్మిక దాడులు చేసి తవ్వకాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ రవాణాతో రహదారులు దెబ్బతింటున్నాయని, కాలుష్యం పెరుగుతోందని వాపోతున్నారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లగా వీఆర్వో, రెవెన్యూ సిబ్బందిని పంపి తవ్వకాలు ఆపివేయిస్తామన్నారు. జేసీబీ, ట్రాక్టర్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయిస్తామని తెలిపారు.

8న విజయవాడలో కౌలు రైతుల సదస్సు


కౌలు రైతులతో మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ

కొల్లూరు, న్యూస్‌టుడే: భూ యజమానితో సంబంధం లేకుండా పంట నష్టపరిహారం కౌలు రైతులకే ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రా రాధాకృష్ణ అన్నారు. మండలంలో వరద ముంపునకు గురైన లంక గ్రామాల్లో బుధవారం పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో జరగనున్న సదస్సును జయప్రదం చేయాలని కౌలు రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ- క్రాప్, ఆన్‌లైన్‌లో నమోదు లాంటి సాంకేతిక కారణాలతో వాస్తవ సాగుదారైన కౌలు రైతు పేరుకు బదులు భూ యజమాని పేరు పంట నష్టపోయిన రైతుల జాబితాలో చేర్చడం వల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. లంక గ్రామాల్లో ప్రధానంగా సాగవుతున్న అరటి, పసుపు, కంద పంటలకు రైతులు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు పెట్టుబడుల రూపంలో వెచ్చిస్తే పంట నష్టపరిహారం రూ.14 వేలు మాత్రమే ప్రభుత్వం అందించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వ్యవసాయ ఖర్చులకు ఇచ్చే రూ. 20 వేల పెట్టుబడి సహాయం కౌలు రైతులకు ఇవ్వాలని కోరారు. రబీలో సాగు చేసే పంట విత్తనాలను వరదల వల్ల నష్టపోయిన రైతులకు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రబీలో సాగు చేసే మొక్కజొన్న విత్తనాల ధరలు నూరు శాతం పెరిగాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తోడేటి సురేష్, కౌలు రైతు సంఘం నాయకుడు జంపాని ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటలు.. భవితకు బాటలు

సత్తా చాటుతున్న బాల, బాలికలు

రేపల్లె అర్బన్, కర్లపాలెం, చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణిస్తున్నారు. క్రమశిక్షణతో చదివి తమకు ఇష్టమైన క్రీడల్లో కఠోర దీక్షతో తర్ఫీదు పొంది ప్రావీణ్యం సాధించి ఉన్నతంగా ఎదిగేందుకు బాటలు వేసుకుంటున్నారు. ఉత్సాహంగా ఆటలపై మక్కువ చూసే బాలబాలికలకు తల్లిదండ్రులు, వ్యాయామోపాధ్యాయులు వెన్నుదన్నుగా నిలిచి ప్రోత్సహిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఇటీవల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14, అండర్-17 నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో బాపట్ల జిల్లాలో పలు పాఠశాలల బాలబాలికలు సత్తాచాటారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, పరుగు, లాంగ్‌జంప్, హైజంప్ తదితర పోటీల్లో ప్రతిభ కనపర్చి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారంతా తమ భవిష్యత్తు లక్ష్యాలను ఇలా వివరించారు.

కబడ్డీపై మక్కువ



ఇటీవల జరిగిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనపర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాను వ్యాయామోపాధ్యాయుడు కృష్ణప్రసాద్ సూచనలు పాటించి జిల్లా పోటీల్లో సత్తా చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యేలా సాధన చేస్తున్నా. పదో తరగతిలో మెరుగైన మార్కులు సాధించి ఇంటర్ తరువాత భారత సైన్యంలో చేరాలని లక్ష్యం పెట్టుకున్నా. అందుకోసం నాకిష్టమైన కబడ్డీని చిన్ననాటి నుంచి ఆడడం అలవాటుగా మార్చుకున్నా.

– దేవా గోకుల్‌చంద్, 10వ తరగతి, పేటేరు, రేపల్లె మండలం

ఉన్నతంగా ఎదగాలని..



అండర్-17 విభాగం లాంగ్‌జంప్ పోటీల్లో ప్రతిభ కనపర్చి జిల్లా స్థాయికి ఎంపికయ్యాను. గతంలో పాఠశాల, మండల స్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నాను. అథ్లెటిక్స్‌లో రాణించిన క్రీడాకారులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. బాగా చదువుతూనే ఆటల్లో ప్రావీణ్యం సాధించి ఉన్నతంగా ఎదగాలని నాన్న చెబుతుంటారు. పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించాలనే ధ్యేయంతో చదువుతున్నా.

– వెంకట సుమశ్రీ, 9వ తరగతి, వేజెళ్లవారిలంక, రేపల్లె మండలం

జాతీయ పోటీల్లో పాల్గొన్నా



షాట్‌పుట్‌లో రాణించి గతేడాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరిగిన జాతీయ పోటీల్లో పాల్గొని ఏడోస్థానంలో నిలిచాను. ఇటీవల నిర్వహించిన నియోజకవర్గస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికయ్యాను. త్వరలో జరిగే పోటీల్లో ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యేలా సాధన చేస్తున్నా. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఇప్పటికే ఎందరో క్రీడాకారులు నిరూపించారు. ఇంజినీరింగ్ రంగంలో రాణించాలని ఆకాంక్షిస్తున్నా.

– ఆర్.వెంకటహర్షవర్ధన్, 10వ తరగతి, మాంట్‌ఫోర్ట్ హైస్కూల్

ఉపాధ్యాయుల తోడ్పాటు



విద్య, క్రీడలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నా. అండర్-14 విభాగంలో 800 మీటర్ల పరుగు, ఖోఖోలో నియోజకవర్గ స్థాయిలో ప్రథమంగా నిలిచాను. జిల్లాస్థాయిలో పరుగు పోటీల ఎంపికలో 5వ స్థానం దక్కింది. జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. రాష్ట్రస్థాయికి ఎన్నికయ్యేందుకు అవసరమైన సాధన, మెలకువలు ఉపాధ్యాయుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటా.

– నాగకేశవ మణికంఠ, హోలియర్ స్కూల్, పొన్నపల్లి, చెరుకుపల్లి మండలం

బాస్కెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి..

సైన్యంలో చేరి దేశసేవ చేస్తా



చింతాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నా. నాన్న వెంకటేష్, అమ్మ తిరుమల ప్రోత్సాహంతో రెండేళ్లుగా బాస్కెట్‌బాల్ ఆడుతున్నా. ఇటీవల చిలకలూరిపేటలో జరిగిన జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. త్వరలో శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు సాధన చేస్తున్నా. సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలనేది లక్ష్యం.

– పూర్ణ వెంకటసాయి, కర్లపాలెం మండలం

నేను పోలీసునవుతా



చింతాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నా. మాది వ్యవసాయ నేపథ్య కుటుంబం. నాకు బాస్కెట్‌బాల్ అంటే ఇష్టమని అమ్మ నాగమణి, నాన్న శివలింగారెడ్డి వెన్నుతట్టారు. ఇటీవల చిలకలూరిపేటలో జరిగిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. రాష్ట్రస్థాయి పోటీలకు సాధన చేస్తున్నా. క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగం సాధిస్తా.

– కృష్ణ చైతన్యరెడ్డి, కర్లపాలెం మండలం

స్ఫూర్తి ప్రదాత మహాత్మాగాంధీ

బాపట్ల, న్యూస్‌టుడే: అహింసావాదంతో భారత జాతికి స్వాతంత్ర్యం తెచ్చిన యుగ పురుషుడిగా మహాత్మాగాంధీ చరిత్రలో నిలిచారని కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్, జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో సత్తిబాబు, ఆర్డీవో గ్లోరియా పూలమాలలు వేసి బుధవారం నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు గాంధీ అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి కోట్ల మంది ప్రజలను కదలించిన శక్తిగా మారారన్నారు. జేసీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఆ స్ఫూర్తితో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.


మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న న్యాయమూర్తులు వాణి, పవన్‌కుమార్, రుక్మిణి

బాపూ బాటలో నడవాలి

జాతిపిత మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింసా మార్గంలో అందరూ నడవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి అన్నారు. జిల్లా కోర్టు, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూర్యలంక రోడ్డులోని పాత కోర్టు భవనాల వద్ద గాంధీ జయంతిని బుధవారం నిర్వహించారు. మహాత్ముడి విగ్రహానికి న్యాయమూర్తులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.పవన్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రుక్మిణి మాట్లాడుతూ మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యం రావాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యప్రసాద్, న్యాయవాదులు ఎన్.నరసింహారావు, జెడ్ బాషా, ఆర్.వెంకటేశ్వర్లు, డి.భాస్కర్, కె.అవినాష్, కె.శేషుకుమార్, వై.నరేష్, ఫిలిప్, చలపతిరావు, నాగమోహిని, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ బాపట్లగా తీర్చిదిద్దుతాం

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రాన్ని అందరి సహకారంతో స్వర్ణ బాపట్లగా తీర్చిదిద్ది ప్రగతిలో ఆదర్శ పట్టణంగా నిలుపుతామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పురపాలక కార్యాలయంలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ వెంకట మురళితో కలిసి ఆయన పాల్గొన్నారు. మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో పురపాలక పారిశుద్ధ్య కార్మికులు ఎనలేని సేవలందించారని ప్రశంసించారు. ఒక్కో కార్మికుడికి రూ.5 వేలు చొప్పున మొత్తం 90 మందికి రూ.4.50 లక్షల నగదు పురస్కారాలు తన సొంత నిధుల నుంచి త్వరలో అందజేస్తానని ప్రకటించారు. బాపట్లను ఉత్తమ పురపాలక సంఘంగా అభివృద్ధి చేస్తామన్నారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో స్వచ్ఛ బాపట్ల కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంకట మురళి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి కాలుష్యం బారి నుంచి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్వచ్ఛత సమగ్ర ప్రగతికి చిహ్నమన్నారు. వరద ప్రభావిత కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లో పారిశుద్ధ్య కార్మికులు గొప్ప సేవలు అందించారని అభినందించారు. కార్మికుల ఆరోగ్యంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్యే, కలెక్టర్ కిట్లు పంపిణీ చేసి సత్కరించారు. విధి నిర్వహణలో గాయపడ్డ కార్మికుడికి పురపాలక సంఘం నుంచి రూ.పది వేల సాయం అందించారు. వేగేశన వ్యక్తిగతంగా రూ.20 వేల సాయం ప్రకటించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా కార్మికులకు దుప్పట్లు, దోమతెరలు అందజేశారు. పురపాలక ప్రత్యేకాధికారి, డీఆర్వో సత్తిబాబు, ఆర్డీవో గ్లోరియా, కమిషనర్ నిర్మల్‌కుమార్, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ నారాయణభట్టు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికులను సత్కరించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ వెంకట మురళి

పురపాలక ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి దీక్ష


దీక్షలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

బాపట్ల: పురపాలక ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జడ వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక క్రీడా వికాస కేంద్రం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సత్యాగ్రహ దీక్షను బుధవారం నిర్వహించారు. తొలుత మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ నేతలు ఎ.శ్రీనివాసరావు, ఎం.సురేష్, టి.సుబ్బారావు, పీవీ సాంబశివరావు, బి.కోటేశ్వరరావు, వై.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కొరత తీరేలా..!

పట్టా భూముల్లో తవ్వకాలకు అనుమతులు ☛ జీవో జారీ చేసిన గనులశాఖ

బాపట్ల, న్యూస్‌టుడే


పట్టా భూముల్లో ఇసుక

భవన నిర్మాణదారులకు మరింతగా ఇసుకను అందుబాటులోకి తీసుకురావటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నదుల్లోని రీచ్‌లతో పాటు పట్టా భూముల్లోనూ ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తూ గనుల శాఖ జీవో జారీ చేసింది. తద్వారా ఇసుక కొరత నివారణకు ప్రణాళికలు రూపొందిస్తోంది. దీనివల్ల ప్రతి నియోజకవర్గంలో కావాల్సినంత ఇసుక నిర్మాణదారులకు తక్కువ ధరకే లభ్యం కానుంది.

జులై నుంచి ఉచితంగా..

తెదేపా నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గత జులై నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసింది. జిల్లాలో జువ్వలపాలెం రీచ్, బాపట్ల మార్కెట్‌యార్డు, వేటపాలెం, కొరిశపాడు మండలం అనమనమూరు, అద్దంకి మండలం తిమ్మాయపాలెం, మార్టూరులోని డంప్ యార్డుల్లో 73 వేల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలకు అందుబాటులో ఉంచారు. రీచ్ నుంచి దూరం ఆధారంగా టన్ను ఇసుక ధరను నిర్ణయించి పట్టికను ప్రదర్శించారు. ప్రజలు ఇసుక బుక్ చేసుకుని వాహనాల్లో తీసుకెళ్లారు. ఆగస్టు మూడో వారానికే ఇసుక నిల్వలు అయిపోయాయి. నెల రోజులుగా గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం నుంచి ఇసుక తెచ్చుకుంటున్నారు. ఇటీవల ప్రభుత్వం ఆన్‌లైన్‌తో పాటు డంప్‌యార్డులు, రీచ్‌లలో సమీపంలోని గ్రామ సచివాలయాల ద్వారా ఇసుక బుక్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించింది ఇసుక ధరతో పాటు దూరం ఆధారంగా ప్రభుత్వం నిర్ణయించిన రవాణా వ్యయాన్ని కొనుగోలుదారులు చెల్లిస్తే కోరుకున్న ప్రాంతానికి వాహనంలో పంపించే విధానానికి శ్రీకారం చుట్టారు.

బుసక అవసరమూ పెరిగింది

ప్రస్తుతం గాజుల్లంక, జువ్వలపాలెం రీచ్‌లు, బాపట్ల మార్కెట్‌యార్డు, వేటపాలెం డంప్ యార్డుల్లో విక్రయానికి ఇసుక లేదు. పూర్తిగా నదుల్లోని ఇసుక పైనే ఆధారపడితే డిమాండ్‌కు తగిన విధంగా సరఫరా చేయలేమని ప్రభుత్వం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. జిల్లాలో ఇసుక నేలలు విస్తారంగా ఉన్నాయి. తీర ప్రాంత నియోజకవర్గాలు బాపట్ల, రేపల్లె, చీరాలలో బుసకతోనే మెరకలు వేస్తారు. భవన నిర్మాణ రంగంలో ఇసుకతో పాటు బుసక అవసరం పెరిగింది. దీంతో ప్రభుత్వం పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చింది. ఆయా భూముల యజమానులు పర్యావరణ అనుమతులు తీసుకున్న తర్వాతే తవ్వకాలు చేపట్టాల్సి ఉంటుంది. గనుల శాఖ జారీ చేసే ఆన్‌లైన్ పర్మిట్ల ద్వారానే విక్రయించాలి. కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా స్థాయి కమిటీ ఇసుక ధరను నిర్ణయిస్తుంది. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో నదీ గర్భంలో ఉన్న పట్టా భూముల్లో మేట వేసిన ఇసుకను గనుల శాఖ ద్వారా తవ్వించనున్నారు. దీనికి పర్యావరణ సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. టన్ను ఇసుకకు పట్టాదారుడికి రూ.66, సీనరేజీ కింద రూ.88 చెల్లించాల్సి ఉంటుంది.

పర్యవేక్షణ అవసరం

పట్టా భూముల్లో తవ్వకాలు చేపడితే జిల్లాలో నిర్మాణదారులకు ఇసుక పుష్కలంగా లభిస్తుంది. పూర్తిగా కృష్ణా, గుండ్లకమ్మ నదులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. తుపానులు, వాయుగుండాల ప్రభావంతో భారీ వర్షాలు కురిసి వరదలు వచ్చినా ఇసుకకు కొరత ఏర్పడదు. అయితే నిబంధనల మేరకే తవ్వకాలు జరిగేలా పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత గనుల శాఖపై ఉంది. ప్రస్తుతం ఒడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణ పనులకు బుసక అవసరం చాలా ఉంది. పట్టా భూముల్లో తవ్వకాలు ప్రారంభిస్తే పైన మూడు నుంచి నాలుగడుగులు వచ్చే బుసకను భవన నిర్మాణ రంగంతో పాటు జాతీయ రహదారి నిర్మాణ పనులకు కేటాయించాలన్న ఆలోచనలో గనుల శాఖ అధికారులు ఉన్నారు.

నిబంధనలు పాటించేలా చూస్తాం

పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇస్తూ జీవో జారీ చేసింది. తవ్వకాలకు సంబంధించి మార్గదర్శకాలపై అందరికీ అవగాహన కల్పిస్తాం. దరఖాస్తులు స్వీకరించి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇసుక తవ్వకాలకు పర్మిట్లు జారీ చేస్తాం. నిబంధనలు కచ్చితంగా పాటించేలా చూస్తాం.

– రాజేష్, ఏడీ, గనుల శాఖ


గాంధీ విగ్రహం ఎదుట ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దు

బాపట్ల, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయకుండా కాపాడుకుందామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దంటూ సీఐటీయూ నేతలు తహసీల్దారు కార్యాలయం ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి బుధవారం వినతి పత్రం అందజేశారు. తొలుత గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ విధుల్లో నుంచి తొలగించిన 4 వేల మంది ఒప్పంద కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. కేంద్రంపై తెదేపా, భాజపా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి శామ్యూల్, నాయకులు శరత్, కుమార్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భళా.. బాలికలు


లక్ష్మీ సింధూర, కవిత

నగరం: జిల్లా కేంద్రం బాపట్లలో 'సేవ్ ది గర్ల్ చైల్డ్' అంశంపై ఇటీవల వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థినులు కె.లక్ష్మీ సింధూర వ్యాస రచన పోటీల్లో జిల్లా స్థాయి ప్రథమ, వక్తృత్వ పోటీల్లో గుంటూరు కవిత తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. ఈ మేరకు విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో ఈనెల 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబరును రొమ్ము కాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు 040- 23551235, 23550967 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

బ్రాయిలర్ ధరలు



(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 143, చికెన్ విత్‌స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

మద్యం అక్రమ విక్రేతపై కేసు

చుండూరు, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు చుండూరు పోలీసులు తెలిపారు. మండలంలో అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వి.కమలాకర్ 60మద్యం సీసాలతో వెళుతుండగా, స్థానిక తుంగభద్ర వంతెన వద్ద అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వివరించారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మానవత్వం చాటారు


చికిత్స పొందుతున్న బాధితులకు పింఛను ఇస్తున్న రిజ్వాన్‌బాబు

అమృతలూరు, న్యూస్‌టుడే: లబ్ధిదారులకు ప్రతి నెలా ఇంటికి వెళ్లి పింఛను పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. లబ్ధిదారులు అనారోగ్యంతో బాధపడుతూ గ్రామానికి దూరంగా వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నా సంబంధిత అధికారులు అక్కడికెళ్లి వారికి పింఛను అందించి మానవత్వం చాటారు. అమృతలూరుకు చెందిన సంకె నిర్మల, కృష్ణకుమారి అనారోగ్యంతో గుంటూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వీరు గ్రామానికి రాలేక పింఛను అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న పింఛను పంపిణీ అధికారి రిజ్వాన్ బాబు బుధవారం స్వయంగా గుంటూరు వైద్యశాలకు వెళ్లి పింఛను అందించారు. ఎంపీడీవో శేషుమాంబ ఆయనకు అభినందనలు తెలిపారు.

బాపట్ల
•బాపట్ల • రేపల్లె • వేమూరు

నేటి నుంచి దసరా ఉత్సవాలు


బాపట్ల: అలంకృత దుర్గాదేవి

బాపట్ల, రాజోలు, గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం బాపట్ల టౌన్‌హాలు సమీప కోన కళాక్షేత్రంలో లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 13 వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు తెలిపారు. రోజూ ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. నరాలశెట్టిపాలెం అష్టలక్ష్మీదేవి, శ్రీనివాసనగర్ కాలనీ మహాలక్ష్మి దేవి, ఎన్ఎస్‌పీ అగ్రహారం దుర్గా ప్రసన్న భవానీమాత, భావనారాయణస్వామి ఆలయాలు, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. చెరుకుపల్లి మండలం రాజోలులోని దుర్గాజీవేశ్వరస్వామి, కనగాల శ్రీపృథ్వీశ్వరస్వామి, నడింపల్లి శ్రీశిఖరేశ్వరస్వామి, పొన్నపల్లి శ్రీదేవునికోటిరెడ్డి ఆశ్రమం, శ్రీసోమేశ్వరస్వామి ఆలయం, కావూరు రామలింగేశ్వరస్వామి, రాంబొట్లపాలెంలోని శ్రీకాశీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, పిట్టుకోటిరెడ్డిపాలెంలోని రెడ్డి సంఘం వద్ద శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాలను ఇప్పటికే ముస్తాబు చేశారు. గుళ్లపల్లి శ్రీగంగాబికా సమేత ఆనందీశ్వరస్వామి వారి ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని, రోజూ సాయంత్రం భజన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు. ఉదయం కలశపూజతో కార్యక్రమాలను ప్రారంభిస్తామన్నారు.


చెరుకుపల్లి: విద్యుత్తు వెలుగుల్లో గుళ్లపల్లి శివాలయం

ధార్మిక చైతన్యం పెంపొందించుకోవాలి


నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

కొల్లూరు, న్యూస్‌టుడే: ప్రజల్లో భక్తిభావం, ధార్మిక చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా తితిదే ఆధ్వర్యంలో గ్రామాల్లో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ధర్మప్రచారక్ కూచిభట్ల శ్రీనివాసశర్మ అన్నారు. మండలంలోని చినపవని ద్రులో తితిదే, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధార్మిక కార్యక్రమంలో ప్రసంగించారు. నాలుగు రోజుల పాటు జరుగనున్న కార్యక్రమాల్లో భజనలు, ఉపన్యాసాలు, లక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలుత భక్తులు స్థానిక వీధుల్లో గోవింద నామాలతో నగర సంకీర్తన చేశారు. కార్యక్రమంలో బూర్లె అరుణకుమారి కూచిభట్ల లక్ష్మీ గాయత్రి, అన్నవరపు నాగమణి, మండలపు రాజకుమారి, అనసూయ పాల్గొన్నారు.

ఉపాధి పథకం కూలీలకు వరం

నిజాంపట్నం, న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకం పేద కూలీలకు వరమని జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య అన్నారు. నిజాంపట్నం సచివాలయం-1 వద్ద ఉపాధి హామీ గ్రామ సభ సర్పంచి కట్టా పోలేరమ్మ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కూలీలకు పని కల్పించడంతో పాటు గ్రామాలు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అధికారులు పనులు గుర్తించి వలసలు నివారించాలన్నారు. సర్పంచి కట్టా పోలేరమ్మ మాట్లాడుతూ పంచాయతీలో అన్ని వీధుల్లో స్వచ్ఛత పనులు చేపట్టాలన్నారు. ఉపసర్పంచి మార్తోటి ఫణీంద్ర, మోపిదేవి హరనాథ్‌బాబు, నాజర్‌వలి, కార్యదర్శి ప్రసాద్, ఏపీవో జయచంద్ర పాల్గొన్నారు.

వరద బాధితులకు దుప్పట్లు, లుంగీలు పంపిణీ


దుప్పట్లు అందిస్తున్న సీఐటీయూ నాయకులు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరద కారణంగా మండలంలోని పెసర్లంక గ్రామంలోని 200మంది బాధిత కుటుంబాలకు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు, లుంగీలు, తువ్వాళ్లు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. రాష్ట్ర కార్యదర్శులు కె. ధనలక్ష్మి, ఎ. ఉమామహేశ్వరరావు బాధితులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్. వి. నరసింహారావు, సీహెచ్. మణిలాల్, సుధాకర్, ఝాన్సీ, ధనలక్ష్మి, ధర్మరాజు, కృష్ణమోహన్, రామస్వామి, నాగేశ్వరరావు, సుబ్బారావు, నాగరాజు పాల్గొన్నారు.

శిరస్త్రాణంతో ముప్పు దూరం


మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు చిత్రంలో పోలీసులు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ శిరస్త్రాణాన్ని ధరించటం వల్ల ప్రాణాలకు రక్షణగా ఉంటుందని డీఎస్పీ రామాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని వెదుళ్లపల్లి కూడలిలో శిరస్త్రాణంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పని సరిగా తమ వెంట వాహనాల ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలని తెలిపారు. సర్కిల్ సీఐ హరికృష్ణ, వెదుళ్లపల్లి ఎస్సై పి. జనార్దనరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పి.వి.పాలెం: ఖాజీపాలెం సీసీ రోడ్డుపై..


రేపల్లె: 25వ వార్డులో రోడ్డుపైనే నాచు పట్టి..


పి.వి.పాలెం: చందోలు సచివాలయం సమీపంలో..

రోడ్లే కాలువలవుతున్నాయ్!

రేపల్లె అర్బన్, ఖాజీపాలెం, చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: బాపట్ల, రేపల్లె నియోజకవర్గాల్లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పలు చోట్ల సిమెంట్ రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. రోడ్లకు ఇరువైపులా కాలువలను ఏర్పాటు చేయకపోవడంతో ఇళ్లలో వాడిన నీరు, వర్షాలకు కురిసిన నీరు రోడ్లను ముంచెత్తుతున్నాయి. పిట్టలవానిపాలెం మండలం చందోలు సచివాలయం సమీపంలో రహదారి చినుకుపడితే జలమయమవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై నీరు నిలవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలు, స్థానికులు నీటిలోనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఖాజీపాలెం గ్రామదేవత యెల్లమ్మ గుడి వెనుక సీసీ రహదారిపై మురుగు నీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందుల పడుతున్నారు. రోడ్డుపై రోజుల తరబడి నీరు నిలిచి దోమలకు నిలయంగా మారుతుంది. ఈ విషయమై ఖాజీపాలెం, చందోలు పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శేషగిరిరావును సంప్రదించగా చుట్టుపక్కల ఇళ్లలో వాడిన నీరు రహదారిపైకి చేరి నిలిచిపోతోందని, ఈ విషయాన్ని పంచాయతీ పాలకుల దృష్టికి తీసుకెళ్లి రహదారికి ఇరువైపులా కాలువలు తీసి నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. రేపల్లె 25వ వార్డు రామకోటిపేటలో మురుగు కాల్వల్లో నీరు పారుదల లేక మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. రోజూ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని వార్డు ప్రజలు ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై తక్షణం పరిశీలించి సక్రమంగా కాలువల్లో మురుగు పారుదల జరిగేలా చర్యలు తీసుకుంటామని రేపల్లె మున్సిపల్ పారిశుద్ధ్య అధికారి రామచంద్రరావు తెలిపారు.

స్వచ్ఛతకు పెద్దపీట వేద్దాం

బాపట్ల, బాపట్ల పట్టణం, రేపల్లె అర్బన్, చెరుకుపల్లి, న్యూస్‌టుడే: సూర్యలంకను స్వచ్ఛ తీరంగా తీర్చిదిద్ది పర్యాటకులను ఆకర్షించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకట మురళి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సూర్యలంక బీచ్ పరిశుభ్రత కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నెహ్రూ యువకేంద్ర, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల విద్యార్థులు శ్రమదానం చేసి తీరంలో వ్యర్థాలు తొలగించారు. స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తీరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తిగా అమలు చేయాలన్నారు. డీపీవో రవికుమార్, నెహ్రూ యువ కేంద్ర రాష్ట్ర సంచాలకుడు ప్రసాద్ దాస్, జిల్లా అధికారి కిరణ్మయి, డీఎల్‌పీవో శరత్, ఎల్‌డీఎం శివకృష్ణ, మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు నిరంజన్‌బాబు, కృష్ణకుమారి, రాజేంద్ర పాల్గొన్నారు. పురపాలక సంఘ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రమదానం చేశారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద గల గాంధీ విగ్రహానికి ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం తొలగించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. ఎన్‌సీసీ అధికారి కత్తి శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రేపల్లె పట్టణాన్ని స్వచ్ఛతకు నిలయంగా తీర్చిదిద్దేందుకు అందరం కృషి చేద్దామని తెదేపా నేత శివప్రసాద్ అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో పెదకూరగాయల మార్కెట్ వద్ద వాటర్ ట్యాంకు, పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ మురుగు కాల్వలు, వీధుల్లో వ్యర్థాలు పడేయకుండా అధికారులకు సహకరించాలని కోరారు. ఛైర్‌పర్సన్ కట్టా మంగ, శానిటరీ అధికారి రామచంద్రరావు, సురేంద్ర, గోపాలరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు. చెరుకుపల్లి పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. సభకు సర్పంచి దేవరకొండ వాణి అధ్యక్షత వహించగా తహసీల్దార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తనుండి సంపద సృష్టి కేంద్రాలను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. ఈవోపీఆర్డీ సునీత, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


బాపట్ల: వ్యర్థాలు తొలగిస్తున్న మహిళా ఇంజినీరింగ్ విద్యార్థినులు


బాపట్ల: పాఠశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వం తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నేతలు పిలుపునిచ్చారు. రేపల్లెలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి బుధవారం మాట్లాడారు. పదేళ్ల పాలనలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరించారు. రేపల్లె నియోజకవర్గ సభ్యత్వ నమోదు బాధ్యుడు రాంపల్లి జగన్నాథశాస్త్రి, సాయివరప్రసాద్, సాయిబాబు, ముద్దు సురేష్ పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా అమావాస్య పూజలు

బాపట్ల, న్యూస్‌టుడే: మహాలయ అమావాస్య సందర్భంగా పడమర బాపట్ల మహర్షి ఆశ్రమంలో సంపత్ గణపతి పరివార్ కన్వీనర్ బాబూనాగేంద్ర ఆధ్వర్యంలో బుధవారం గోపూజ నిర్వహించి పితృదేవతలకు తర్పణాలు ఇచ్చారు. సామూహిక పూజలు చేశారు.

రేపల్లె విద్యార్థులు తైక్వాండోలో రాణింపు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె కింగ్స్‌వే అకాడమీ విద్యార్థులు ఈనెల 1న తెనాలి ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీల్లో రాణించారు. ప్రవీణ్ సాయి రాఘవ రజత, సోహన్, చరణ్‌గౌడ్, నిఖిలేష్‌వర్మ, రోషన్‌కుమార్ కాంస్య పతకాలు సాధించినట్లు శిక్షకుడు రవీంద్ర, అకాడమీ నిర్వాహకుడు జగన్మోహనరావు బుధవారం తెలిపారు. విజేతలను అభినందించారు.

మద్యం దుకాణాలకు 9 వరకు దరఖాస్తులు

నగరం, నిజాంపట్నం, న్యూస్‌టుడే: ఈనెల 9వ తేదీ వరకు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్ ప్రసాద్ బుధవారం పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నగరం స్టేషన్ పరిధిలో నగరం మండలంలో 3, నిజాంపట్నం మండలంలో 4, చెరుకుపల్లి మండలంలో 5 దుకాణాలకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు నగరం ఎక్సైజ్ స్టేషన్ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. నిజాంపట్నంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 11న ఉదయం 8 గంటలకు లాటరీ తీస్తామన్నారు. అనంతరం మద్యం దుకాణాల్లో పని చేస్తున్న ఉద్యోగులతో మాట్లాడారు.

అంచుల్లో అపాయం



మండలంలో కూచినపూడి పంచాయతీ క్రావారిపాలెం ఎస్సీ కాలనీలో కొన్నేళ్ల క్రితం సిమెంటు రహదారి నిర్మించారు. అంచులు నిర్మించాల్సి ఉన్నా చేయలేదు. అవి లేకపోవడంతో రాత్రిళ్లు ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. రహదారిపై పడి పలువురు గాయాలపాలైనట్లు స్థానికులు తెలిపారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ చక్రవర్తి వద్ద ప్రస్తావించగా సమస్య తమ దృష్టికి రాలేదని, క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచులు నిర్మించి సమస్య పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

– న్యూస్‌టుడే, నిజాంపట్నం

చెరువు కాదిది.. చావలి మార్గం



మండల కేంద్రం వేమూరు నుంచి చావలి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిపై బలిజేపల్లి నుంచి చావలి వరకు చాలా చోట్ల గుంతలు పడ్డాయి. రెండు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రహదారిలో ఒక్కో చోట అడుగు లోతున గుంతలు పడ్డాయి. వర్షాకాలంలో అందులో నీరు చేరడం వల్ల గుంత లోతు ఎంతుందో తెలియక వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. చాలా కాలం నుంచి పరిస్థితి ఇలా ఉన్నా పట్టించుకున్న నాథులు లేరని ఆ మార్గంలో ప్రయాణికులు వాపోతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ నరసింహారావును సంప్రదించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి గుంతలను పూడ్పించి మరమ్మతులు చేయిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, వేమూరు


వద్దన్నా.. వినరే!


చెత్త వేయవద్దంటూ పెట్టిన హెచ్చరిక బోర్డు వద్దే వ్యర్థాలు

'ఇక్కడ చెత్త వేయవద్దంటూ' గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు అలంకారప్రాయంగా మారుతున్నాయి. గ్రామాల స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పలు కూడళ్లలో ఏర్పాటు చేస్తున్న ఇలాంటి సూచక ఫలకాల వద్దే చెత్త ఇతర వ్యర్థాలు కుప్పలుగా పోస్తుండడం దారుణమని పలువురు పేర్కొంటున్నారు. పిట్టలవానిపాలెం పంచాయతీ పరిధిలో సామాజిక ఆరోగ్య కేంద్రం మలుపు వద్ద ఏర్పాటు చేసిన బోర్డు వద్దే స్థానికులు వ్యర్థాలు పారబోశారు. అధికారులు నిత్యం రాకపోకలు సాగించే మండల కేంద్రంలోనే ఇలా ఉంటే మిగతా గ్రామాల్లో పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి శివకుమార్‌ను సంప్రదించగా సిబ్బందిని పంపి వెంటనే చెత్త వ్యర్థాలను తొలగిస్తాం. మళ్లీ వేయకుండా చూస్తామన్నారు.– న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం


బాపట్లలో విశ్రాంత సైనికులు..


బాపట్ల: ఎంపీ తెన్నేటి కార్యాలయంలో..


పి.వి.పాలెంలో జ్యోతి వెలిగిస్తున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు


అమృతలూరు: తెదేపా కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసిన నేతలు


చిరస్మరణీయుడు బాపూజీ

బాపట్ల, బాపట్ల పట్టణం, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, రేపల్లె అర్బన్, చెరుకుపల్లి, గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), నగరం, నిజాంపట్నం, వేమూరు, అమృతలూరు, భట్టిప్రోలు, న్యూస్‌టుడే: భారతీయులను ఏకతాటిపై నిలిపి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహా నాయకుడిగా బాపూజీ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచారని వక్తలు కొనియాడారు. గాంధీ జయంతి సందర్భంగా బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని మండలాల్లో పలు ప్రధాన కూడళ్లలో గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పార్టీ కార్యాలయాల్లోనూ గాంధీ చిత్రపటాల వద్ద జ్యోతి వెలిగించారు. బాపట్ల గడియార స్తంభం, భీమావారిపాలెంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వేగేశన, తెదేపా నేతలు శ్రీనివాసరావు, ప్రమీలారాణి, లీలాకృష్ణ, సచిన్, సరోజిని, ఆంద్రేయ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఏజీ కళాశాల, ఎన్టీఆర్ ఏజీ ఇంజినీరింగ్ కళాశాల, ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో ఏడీలు ప్రసూనరాణి, స్మిత్, బేగ్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గడియారస్తంభం వద్ద గాంధీ విగ్రహానికి భాజపా జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, పట్టణాధ్యక్షుడు మామిడి రాజశేఖర్, నేతలు, విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, నేతలు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కోళ్లపూడి ఉపేంద్రగుప్తా, కార్యదర్శి వేజెండ్ల శ్రీనివాసరావు, ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్థానిక వివేకానందకాలనీలోని ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ కార్యాలయంలో నాయకులు దగ్గుమల్లి కిరణ్‌కుమార్, పఠాన్ రాజేష్, ఏడుకొండలు, బుచ్చిబాబు, సంగీత ప్రసాద్, కనకదుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రేపల్లె పాతపట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా నాయకుడు అనగాని శివప్రసాద్, తహసీల్దారు శ్రీనివాసరావు, శోభారాణి, సీఐలు మల్లికార్జునరావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కర్లపాలెంలో ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద గాంధీ విగ్రహానికి తెదేపా మండలాధ్యక్షుడు భూపతిరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తూనుగుంట్ల శ్రీనివాసరావు మాట్లాడారు. అలకాపురంలో సర్పంచి మంతెన గంగరాజు పాల్గొన్నారు. భట్టిప్రోలు మండలం అద్దేపల్లిలో విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు గాంధీ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి జడ్పీఉన్నత పాఠశాలలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నగరం మండలం ధూళిపూడిలో గాంధీ విగ్రహానికి మండల ఆర్యవైశ్య నాయకులు, శ్రీవెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బుచ్చియ్యచౌదరి, ప్రిన్సిపల్ హరికృష్ణ నివాళులు అర్పించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్ ప్రసాద్, స్థానిక స్టేషన్లో ఎస్సై భార్గవ్ ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. వేమూరు, జంపని, పెరవలిలో గాంధీజీ విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాంపట్నం ప్రధాన బజారులో గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. అమృతలూరు తెదేపా కార్యాలయంలో చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ప్యాపర్రు వృద్ధాశ్రమంలో మైనేని రత్నప్రసాద్ మిత్ర బృందం సహకారంతో నిత్యావసర సరకులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. చెరుకుపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచి దేవరకొండ వాణి అధ్యక్షత వహించగా తహసీల్దార్ పద్మావతి మాట్లాడుతూ అహింసా సిద్ధాంతం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహోన్నత వ్యక్తి గాంధీజీ అని కొనియాడారు.


బాపట్ల: బాపూ విగ్రహానికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే నరేంద్రవర్మ, తెదేపా నేతలు


వేమూరు: జంపనిలో ఆర్యవైశ్య సంఘం నాయకులు..


చెరుకుపల్లి: గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మహాత్ముడి విగ్రహం వద్ద నడకదారులు


రేపల్లె పాతపట్టణంలో గాంధీ విగ్రహానికి తెదేపా నాయకుల నివాళి

ఎట్టకేలకు తూటుకాడ తొలగింపు


యాజలి డ్రెయిన్‌లో తూటుకాడ తొలగిస్తున్న కూలీలు

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు యాజలి డ్రెయిన్ తూటుకాడ, గుర్రపుడెక్కతో నిండి ఉండటంతో పొలాల్లో మురుగు నీరు బయటకు పోక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరి పొలాలు నిండా మునగటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీనిపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. రైతులు కూడా ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఏఈ పాండురంగారావు మూడ్రోజులుగా కూలీలతో తూటుకాడ, గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు చేపట్టారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

అమృతలూరు, న్యూస్‌టుడే: అమృతలూరు-పాంచాళవరం రోడ్డు మార్గంలో ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తి మద్యం తీసుకెళుతుండగా గుర్తించిన పోలీసులు బుధవారం వెంబడించారు. నిందితుడు మద్యం సీసాలను వదిలి పరారయ్యాడు. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై అమరవర్ధన్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కర్లపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని యాజలి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కర్లపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఎవరైనా అక్రమ ఇసుక తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై రవీంద్ర హెచ్చరించారు.

చీరాల
• చీరాల • అద్దంకి • పర్చూరు

కొరిశపాడు తహసీల్దార్‌గా జీవీ సుబ్బారెడ్డి



మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండల తహసీల్దార్‌గా జీవీ సుబ్బారెడ్డిని నియమిస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. గతంలో ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వరరావు బదిలీపై కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు.

అద్దంకి, బల్లికురవల్లో వర్షం

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే : ఉదయం నుంచి అధికంగా ఎండ.. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షపు జల్లులు అద్దంకి, బల్లికురవ మండలాల్లో కురిశాయి. సాయంత్రం నాలుగు గంటల వరకు సుమారు 36-40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం ఆరు గంటల నుంచి ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతవరణం చల్లబడింది.

రెండు గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా

కలవకూరు(అద్దంకి): గ్రామీణ ప్రాంతాలకు త్రీఫేజ్ విద్యుత్తు సదుపాయం కల్పించాలన్న ప్రభుత్వ ఆశయాన్ని తొలివిడతగా కలవకూరు, గుర్రంవారిపాలెంలో సమకూర్చారు. మరమ్మతులకు గురైన 360 పాత విద్యుత్తు స్తంభాల స్థానంలో కొత్త వాటితో పాటు మరో 40 కొత్త విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసినట్లు విద్యుత్తు శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు.

అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.రత్నకుమారి, ఎన్‌సీసీ అధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో స్వచ్ఛతా దివస్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థులు మొక్కలను చేత పట్టుకొని అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి అంటూ చినగంజాంలో ప్రదర్శన నిర్వహించారు. మొక్కలు వల్ల సమాజానికి కలిగే ప్రయోజనంపై హెచ్‌ఎం, ఎన్‌సీసీ అధికారి వివరించారు.

నమూనా పరీక్షలతో అభ్యర్థులకు ప్రయోజనం



ప్రశ్నపత్రం ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

చీరాల, న్యూస్‌టుడే : నమూనా పరీక్షలతో ఉద్యోగార్థులు తమ సన్నద్ధతను పరీక్షించుకుని లోపాలు సరిచేసుకొనే అవకాశం ఉంటుందని చీరాల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జీ. రమేష్‌బాబు పేర్కొన్నారు. నేతాజీ సేవాసమితి ఆధ్వర్యంలో పేరాల ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం టెట్ ఉచిత నమూనా పరీక్ష నిర్వహించారు. ప్రశ్నాపత్రాలు ఆవిష్కరించిన అనంతరం రమేష్‌బాబు మాట్లాడుతూ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కనిగిరి టీచర్స్ అకాడమీ వారి సహకారంతో నిర్వహించిన పరీక్షలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారికి ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు.

క్రీడల్లో సత్తా చాటిన ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి ప్రత్యేకత చాటారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఇంకొల్లులో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడల్లో వివిధ విభాగాల నుంచి పాఠశాలకు చెందిన 12 మంది క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. వీరిని పాఠశాలలో బుధవారం సత్కరించారు.

అద్దంకిలో వరుస దొంగతనాలు!

ఒంటరి మహిళలే లక్ష్యంగా బంగారు ఆభరణాల అపహరణ

అద్దంకి, న్యూస్‌టుడే

ఇటీవల అద్దంకిలో మహిళల మెడల్లో బంగారు గొలుసుల దొంగతనాలు చోటు చేసుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాజాగా ఉదయం, సాయంత్రం వేళల్లో నడక సాగించే మహిళలలే లక్ష్యంగా చోరులు వారి మెడల్లోని బంగారు ఆభరణాలు లాక్కుని ఉడాయిస్తున్నారు. అంతేకాకుండా ఎవరూలేని సమయంలో ఆలయాల తలుపులు పగులగొట్టి హుండీలను అపహరిస్తున్నారు.



వినాయకస్వామి ఆలయం తలుపులు పగులగొట్టిన దృశ్యం

వేలమూరిపాడు రోడ్డులోనే మహిళల మెడలో గొలుసు చోరీలు: గత నెల 30న సాయంత్రం నడక కోసం స్నేహితురాలితో కలిసి వచ్చిన మహిళను గుర్తించిన ఆగంతకుడు ద్విచక్రవాహనంపై రెండు పర్యాయాలు రెక్కీ నిర్వహించాడు. నడక ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న ఆమెను ద్విచక్రవాహనంతో వెంబడించి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసు లాక్కుని ఉడాయించాడు. ఇద్దరు మహిళలు తేరుకునే లోపే ఆగంతకుడు పరారయ్యాడు.

☛ ఏడాదిన్నర క్రితం కూడా ఇలాంటి సంఘటనే చోటు చేసుకుంది. సాయంత్రం నడకకు వచ్చిన మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించి పరారయ్యాడు. మూడు సవర్ల బంగారు గొలుసును ఒంటరిగా నడకకు వచ్చిన మహిళను అనుసరించి లాక్కుని ఉడాయించాడు. నిరంతరం జనసంచారం ఉంటున్నా మహిళల మెడల్లో బంగారు గొలుసులు లాక్కుని ఉడాయిస్తుండటంపై మహిళలు, ప్రజలు భీతిల్లుతున్నారు. అద్దంకి పట్టణానికి రెండు కి.మీ. దూరంలోని వేలమూరిపాడు వాసులు నిరంతరం తిరుగుతుంటారు. ఈ ప్రాంతాల్లోనే చోరీలు జరుగుతుండటంపై ఆందోళన చెందుతున్నారు

☛ గత నెల 27వ తేదీ రాత్రి వేలమూరిపాడు రోడ్డులోని వినాయక, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల తలుపులు పగలగొట్టిన ఆగంతకులు నాలుగు హుండీలను అపహరించారు. నాలుగు హుండీల్లో సుమారు రూ.10వేల వరకు భక్తులు అందించిన విరాళాల నగదు ఉండవచ్చని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.



గుడిలో చోరీ విషయమై స్థానికులతో మాట్లాడుతున్న సీఐ పి.కృష్ణయ్య

నడక సమయంలో వస్తువులు భద్రపరచుకోవాలి

రాత్రి వేళల్లో జనసంచారం తక్కువగా ఉంటున్నందున దొంగతనాలు జరిగే అవకాశం ఉంది. అందువల్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. అపరిచిత వ్యక్తులు ఎవరైనా తారసపడితే వెంటనే ప్రశ్నించండి, పోలీసులకు సమాచారం ఇవ్వండి. అలాగే సాయంత్రం వేళల్లో నడక సాగించే మహిళలు అప్రమత్తంగా ఉండాలి. ముగ్గురు, నలుగురు కలిసి నడకకు వెళ్లాలి. నడక సమయంలో ఆభరణాలు ఇంటి వద్దనే ఉంచితే దొంగతనాలు నివారించొచ్చు. దేవాలయాల నిర్వాహకులు సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకుంటే ఆగంతకులను గుర్తించడానికి వీలు ఉంటుంది. - పి.కృష్ణయ్య, సీఐ

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



అటవీ శాఖ అధికారి బ్రహ్మయ్యకు సీడ్ బాల్స్ అందజేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పరిగణించాలని వాసవీ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవిచంద్రన్ ఆదేశాల మేరకు గాంధీ జయంతి రోజైన బుధవారం వాడరేవులోని నగర వనం అటవీశాఖ అధికారి బ్రహ్మయ్యకు వాసవీ, వనితా వైష్ణవి క్లబ్స్ తరఫున 20వేలు సీడ్ బాల్స్ అందజేశారు.

శ్రమ దోపిడీని నివారించే సాహిత్యం అవసరం

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకుని సొంత కాళ్లపై నిలబడుతున్న మహిళలపై లైంగిక దాడులు, శ్రమ దోపిడీలు పెరుగుతున్నాయని, వీటిని నివారించే నవ్య సాహిత్యం ప్రస్తుత సమాజానికి అవసరమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రధానాచార్యులు, ప్రముఖ సాహితీ కారిణి చల్లపల్లి స్వరూపారాణి అన్నారు. చీరాల మండలం కావూరివారిపాలెం పంచాయతీ పరిధి తులసీ నగర్‌లో వివేకా సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నెల నెల నందివర్ధనం సాహితీ కార్యక్రమంలో భాగంగా బుధవారం దళిత "స్త్రీ వాదం - విస్తృత విభిన్నతలు" అన్న అంశంపై ఆమె ప్రసంగించారు. 19వ శతాబ్దంలో పుల్లగూర దీనమ్మ, లింగమ్మ, తాడి నాగమ్మ, పరిపూర్ణ, దయయ్య, సువర్ణమ్మ, ఆధునిక కాలంలో సుజ్ఞ, శ్యామల, వినోదిని, మార్గరేట్, మానస, భారతి, దీపన, వినోదిని వంటి వారు తమ కలాలకు పదును పెట్టి అనేక ఆవిష్కరణలు వెలుగు చూసేలా కృషి చేశారని ఆమె తెలిపారు.

యువతకు ఉపాధి కల్పించాలి



దామచర్ల సత్యతో ఎమ్మెల్యే ఏలూరి, నియోజకవర్గంలోని నాయకులు

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర మారిటైన్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసినట్లు ఏలూరి క్యాంప్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రాభివృద్ధిలో కీలక భూమి పోషించే మారిటైన్ ద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమల సాధనకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారన్నారు. ఓడరేవుల అభివృద్ధి ప్రత్యేక దృష్టి సారించాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గం తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మహాత్మా.. మన్నించు

మేదరమెట్ల, అద్దంకి, ఇంకొల్లు: అద్దంకి, కొరిశపాడు మండలాల్లో బుధవారం గాంధీ జయంతి రోజున యథేచ్ఛగా మద్యం, మాంసం విక్రయాలు జోరుగా సాగాయి. కొంత మంది గొలుసు దుకాణదారులు ముందు రోజే మద్యం సీసాలు కొనుగోలు చేసి గాంధీజయంతి రోజున రూ. సీసాకు రూ.60 నుంచి రూ.100 వరకు అదనంగా విక్రయిస్తున్నారు. అవసరమైన వారికి ద్విచక్రవాహనాల్లో తీసుకువచ్చి మరీ అందిస్తున్నారు. అమ్మకాలు జరుగుతున్న సంబంధిత అధికారులు ఒక్కరూ కూడా పట్టించుకోకపోవడం గమనార్హం. అద్దంకి పట్టణంలో కూడా మద్యం గొలుసు దుకాణాల్లో మద్యం విక్రయాలు కొనసాగించారు. వీటితో పాటు మాంసం దుకాణాలు, మాంసాహార శాలలు తెరచి ఉంచారు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్సై హర్షవర్ధన్ రెడ్డి మద్యం గొలుసు దుకాణాలపై దాడులు జరపగా అప్పటికే గొలుసు దుకాణ నిర్వాహకులు తలుపులు మూసి పరారయ్యారు. మున్సిపల్ శానిటరీ అధికారులు చికెన్ దుకాణాలను మూసివేయించారు.



మేదరమెట్లలో బైక్‌లో ఉంచి విక్రయిస్తున్న మద్యం సీసాలు

నేటి నుంచి శరన్నవరాత్రులు

విద్యుత్తు దీపాలతో ఆలయాలు ముస్తాబు

చీరాల అర్బన్, వేటపాలెం, అద్దంకి, జే పంగులూరు, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రులు గురువారం నుంచి చీరాల, అద్దంకి నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఆయా కమిటీల ఆధ్వర్యంలో దేవాలయాలను విద్యుత్తు దీపాలతో ముస్తాబు చేశారు. ఉదయం కలశ స్థాపనతో కార్యక్రమాలకు అంకురార్పణ జరగనుంది. నవరాత్రులు పురస్కరించుకుని ఉదయం, రాత్రికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. వీటితో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు సైతం నిర్వహించనున్నారు.



విద్యుత్తు దీపాలంకరణలో వేటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయం



అద్దంకి ప్రధానవీధిలో విద్యుద్దీపాలంకరణ

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

చీరాల, న్యూస్‌టుడే : చెపటివారం క్రికెట్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ఎంపికైన వేటపాలేనికి చెందిన లారెన్స్‌కు తెదేపా అధికార ప్రతినిధి ఎం.మహేంద్రనాథ్ రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మహేంద్రనాథ్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించటంలో తెదేపా ముందుంటుందని తెలిపారు.

పూర్తికాని భవనం.. హడావుడిగా ఆరంభం

కలవకూరు (అద్దంకి), న్యూస్‌టుడే: కలవకూరులో వెల్‌నెస్ సెంటర్(విలేజ్ హెల్త్ క్లినిక్) భవన నిర్మాణ పనులు పూర్తికాకుండానే హడావిడిగా ప్రారంభించారు. తాత్కాలికంగా రోగులకు వైద్యసేవలు అందించేందుకు మాత్రమే కొన్ని గదులు పూర్తి చేశారు. మరో రెండు అర్ధాంతరంగా వదిలేశారు. దీని నిర్మాణానికి వైకాపా ప్రభుత్వంలో రూ.17.5 లక్షలు కేటాయించారు. రైతుసేవా కేంద్రం, సచివాలయం భవనంతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ఒకే ప్రాంగణంలో ఉండేలా ప్రణాళిక తయారు చేశారు. మిగిలిన రెండు భవనాలు ప్రారంభించే సమయంలో అసంపూర్తిగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌ను హడావిడిగా ఆరంభించారు. పైపెచ్చు ఈ భవనం వద్దకు రోగులు చేరుకునేందుకు సరైన రహదారి సదుపాయం లేదు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి ప్రిస్కిల్లాను వివరణ కోరగా రోగులను చూసే ఓపీ విభాగం వరకు పూర్తయిందని, రోగులకు సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. వైద్యుల గది మాత్రమే బండపరుపు పూర్తి కావాల్సి ఉందన్నారు.



కలవకూరులో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనం



బండపరుపు లేని వైద్యుడి గది

చినుకురాలితే తటాకమే



వాన నీటితో తటాకంలా హైవే సేవామార్గం

మార్టూరులోని 16 నెంబరు జాతీయ రహదారి సేవా మార్గంలో చినుకురాలితే నీరు చేరి తటాకంలా మారడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. బుధవారం తేలికపాటి జల్లులు కురవడంతో మార్టూరులోని ప్రధాన అండర్ పాస్ వద్ద నీరు చేరడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. -న్యూస్‌టుడే, మార్టూరు

దసరా సెలవులొచ్చాయ్.. ఇంటికి వెళ్తాం

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే : దసరా సెలవుల నేపథ్యంలో విద్యాలయాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో శింగరకొండ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో చదువుకుంటున్న 620 మంది విద్యార్థినులు ఇంటిబాట పట్టారు. రెండో తేదీ నుంచి 13 వరకు సెలవుల నేపథ్యంలో బుధవారం ఉదయం శింగరకొండ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో గాంధీ జయంతి నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు, సంరక్షకులు వెంట రాగా వారితో విద్యార్థినులు స్వగ్రామాలకు ప్రయాణమయ్యారు. దీంతో గురుకుల విద్యాలయం ప్రాంగణంలో సందడి నెలకొంది.



గురుకులం నుంచి బయటకు వస్తున్న విద్యార్థినులు

రహదారి మరమ్మతులకు నడుం బిగించిన గ్రామస్థులు

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: అధ్వానంగా మారిన రహదారి మరమ్మతులకు అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతో చేసేది లేక గ్రామస్థులే స్వచ్ఛందంగా బాగు చేసుకునేందుకు నడుం బిగించారు. మండలంలోని కొమర్నేనివారి పాలెం నుంచి చెరుకూరు, పర్చూరు గ్రామాలకు ఏర్పాటు చేసిన ర.భ రహదారి కొద్ది నెలలుగా దుస్థితికి చేరింది. దీంతో గ్రామస్థులు బుధవారం ప్రత్యేకంగా నిధులు సమకూర్చుకుని వాహనాలతో గ్రావెల్ తరలించి గుంతలు పూడ్చారు.



ప్రజోపయోగ పనులకు ప్రాధాన్యం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఉపాధిహామి పథకంతో ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఉంటుందని ఉపాధిహామీ పథకం ఏపీఎం రేణుక పేర్కొన్నారు. బుధవారం వంకాయలపాడులో జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. 2025-26 సంవత్సరంలో చేపట్టబోయే పనులను వివరిస్తూ పొలాలకు వెళ్లే ఆర్సీపీ రహదారుల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, పశువుల షెడ్ల నిర్మాణం, గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణం, పంట కాలువల్లో పూడిక తీత, రహదారుల వెంట మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఉందని వివరించారు.



వేటపాలెంలో పట్టభద్రుల సంఘం ప్రతినిధులు




చీరాల: మహాత్ముడికి నివాళి అర్పిస్తున్న న్యాయమూర్తి ఎం.సుధా



అద్దంకి పురపాలక సంఘం వద్ద కార్మికులను సత్కరిస్తున్న కమిషనర్, కౌన్సిలర్లు



తిమ్మాయపాలెం ఉన్నత పాఠశాల వద్ద..



ఇంకొల్లు: గాంధీ వేషధారణతో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు



అద్దంకి: గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

భావితరాలకు గాంధీజీ జీవితం ఆదర్శం

నేటితరం యువతకు మహాత్మాగాంధీ జీవితం ఆదర్శమని పలువురు వక్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. బుధవారం గాంధీజయంతి సందర్భంగా చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో వేడుకలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ బాపూజీ అడుగుజాడల్లో పయనించి హింసను రూపుమాపేందుకు కృషి చేయాలని సూచించారు. -న్యూస్‌టుడే బృందం



ఏల్చూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో షటిల్ క్రీడాకారులు



మార్టూరు ప్రభుత్వ కార్యాలయాల వద్ద..



పూనూరులో ..



వలపర్లలో పాఠశాలలో..



విగ్రహావిష్కరణలో ఆర్యవైశ్య సంఘం నేతలు

ప్రసన్నాంజనేయస్వామికి అరటిపండ్ల పూజ



శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే : ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మహాలయ అమావాస్య సందర్భంగా పదివేల అరటి పండ్లతో పూజ నిర్వహించారు. ఉభయ దాతలుగా కొరిశపాడు మండలం కుర్రవానిపాలేనికి చెందిన నాదెండ్ల కోటేశ్వరరావు, పద్మజ దంపతులు వ్యవహరించారు.

అపరిశుభ్రతకు నిలయం.. చేపల మార్కెట్

కొత్తపాలెం (చినగంజాం), న్యూస్‌టుడే: చినగంజాం మండలంలోని కొత్తపాలెం పంచాయతీ పరిధిలో చేపల మార్కెట్ అపరిశుభ్రత నిలయంగా మారింది. మండల ప్రజలతో పాటు ఇతర మండలాలకు చెందిన వారు ఇక్కడకు వచ్చి తాజా చేపలు కొని తీసుకెళుతుంటారు. మార్కెట్ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు. అయినా చేపలు అమ్ముకునేవారికి, కొనుగోలుదారులకు సరైన వసతులు లేవు. ఎండలకు ఎండుతూ, వానకు తడుస్తూ వ్యాపారులు చేపలు, రొయ్యలు విక్రయిస్తుంటే వాటిని కొన్నవారు ఎండుతూ, తడుస్తూనే కొని చేయించుకొని తీసుకెళుతుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు మార్కెట్‌లో నీరు చేరింది. దీంతో దోమల వ్యాప్తి పెరిగింది. కుక్కల బెడద ఉంది. వీటి కారణంగా వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ప్రస్తుతం వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. అయినా అధికారులు సరైన షెడ్లు, ఇతర వసతులను చేపల మార్కెట్‌లో ఏర్పాటు చేయడం లేదని వినియోగదారులు, వ్యాపారులు అంటున్నారు. ప్రజలు, వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని షెడ్లను నిర్మించాల్సిన అవసరం ఉంది. ఆదివారం చేపల మార్కెట్‌కు చాలా మంది వస్తారు. తీరా ఇక్కడకు వచ్చిన తరువాత వర్షపు నీటిలోనూ, బురదలోనూ నిలబడి కొని తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. సరైన షెడ్లు లేనందున నీరు నిలిచి, దోమలవ్యాప్తి ఎక్కువగా ఉందని పూలవారిపాలేనికి చెందిన బొప్పన శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తంచేశారు.



చేపలు చేసే ప్రాంతంలో బురదమయం

జన్మభూమి రుణం తీర్చుకోవాలి

ఇంకొల్లు: జన్మభూమి రుణం తీర్చుకోవాలని ప్రకాశం జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 1985-86 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు.



ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

నిలిచిన ట్రక్కు ఆటోను ఢీకొట్టిన లారీ



మార్టూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై టైరు పంక్చరై నిలిచిన వాహనాన్ని లారీ బలంగా ఢీకొట్టిన సంఘటన బుధవారం మండలంలోని ఇసుకదర్శి ఎక్స్‌ప్రెస్ హైవే వైవంతెనపై జరిగింది. చిలకలూరిపేట వైపు నుంచి ఒంగోలుకు మొక్కల లోడుతో వెళ్తున్న ట్రక్కు ఆటో టైరు పంక్చర్ కావడంతో చోదకుడు మరమ్మతులు చేసుకునేందుకు హైవే వంతెనపై నిలిపాడు. అదే మార్గంలో నెల్లూరు వైపు ప్రయాణించే లారీ ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టడంతో రోడ్డుపై బోల్తాపడింది. ఆ సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు వెల్లడించారు.

సామూహిక పిండ ప్రదానం

వేటపాలెం, న్యూస్‌టుడే: చీరాల గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో బుధవారం రామాపురం తీరంలో మహాలయ అమావాస్య సందర్భంగా సామూహిక శ్రాద్ధ తర్పణ- పిండ ప్రదానం క్రతువు రుత్వికుల ఆధ్వర్యంలో మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు.

చెట్ల తొలగింపుపై అభ్యంతరం

అద్దంకి: అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డులో చెట్ల తొలగింపుపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారుల అనుమతి లేకుండా చెట్లను నరికివేయడంపై ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, మరో ముగ్గురుపై కేసు

చినగంజాం, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని భర్తపై కేసు నమోదైంది. ఎస్సై శీలం రమేష్ వివరాల మేరకు.. మూలగానివారిపాలేనికి చెందిన కోట చక్రధరరెడ్డి పోస్టల్‌శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి చినగంజాంకు చెందిన కావ్యతో ఏడాది కిందట వివాహంమైంది. పెళ్లి సమయంలో కట్నం కింద రూ.4 లక్షల నగదు, బంగారం ఇచ్చారు. వివాహమైన అనంతరం అదనంగా కట్నం తెమ్మని మద్యం తాగి భర్త, అతడి తల్లి మంగమ్మ, ఆడపడుచు బొడ్డు వెంకటరమణ అతని భర్త శ్రీను హింసుస్తున్నారు. బుధవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్తతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆటో డ్రైవర్‌ను గాయపర్చిన ఇద్దరిపై..

చినగంజాం, న్యూస్‌టుడే: ఆటోలో ఎక్కించుకోలేదని డ్రైవర్‌ను చితకబాదిన ఇద్దరిపై కేసు నమోదైంది. ఎస్సై శీలం రమేష్ వివరాల మేరకు.. అడవీధిపాలేనికి చెందిన దైవాల జాలిరెడ్డి సోమవారం తన ఆటోలో గడ్డి వేసుకొని ఇంటికి వస్తున్నాడు. గ్రామంలోని చికెన్ షాపు వద్దకు రాగానే అదే గ్రామానికి చెందిన దైవాల వెంకయ్య, రామలింగం వెంకటేశ్వరరెడ్డి ఆటో ఆపారు. ఇద్దరిని ఆటోలో తమ ఇళ్ల వద్ద దించాలని కోరారు. ఆటోలో గడ్డి ఉందని కుదరదని చెప్పాడు. దీంతో వారిద్దరూ జాలిరెడ్డిని కొట్టి గాయపర్చారు. చీరాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకయ్య, వెంకటేశ్వరరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

పురుగు మందుల దుకాణంలో చోరీ

కొప్పరం (సంతమాగులూరు), న్యూస్‌టుడే: కొప్పరంలోని సయ్యద్ మన్సూర్ బాషాకు చెందిన పురుగు మందుల దుకాణంలో మంగళవారం రాత్రి దొంగతనం జరిగినట్లు ఎస్సై ఎం. పట్టాభిరామయ్య తెలిపారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం షట్టర్ పగులగొట్టి అందులో నిల్వ ఉంచిన 650 పురుగు మందుల డబ్బాలు అపహరించుకుపోయినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాటి విలువ రూ. 2 లక్షల వరకు ఉంటుందని చెప్పారు.

మద్యం సీసాలు స్వాధీనం

యద్దనపూడి, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న నరసరావుపేటకు చెందిన పల్లపు గిరిధర్ మణికంఠను ఎస్సై రత్నకుమారి బుధవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. అక్రమంగా 14 మద్యం సీసాలు తరలిస్తుండగా బస్టాండు కూడలి వద్ద అదుపులోకి సీజ్ చేసినట్లు వెల్లడించారు.

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: మొదటి పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని నల్లగాంధీ బొమ్మ రోడ్డు నుంచి కుందేరుకి వెళ్లే దారిలోని కబేళా సమీపంలో నివసిస్తున్న సీమోన్ అనే వ్యక్తి నుంచి అక్రమంగా నిల్వ ఉంచి 90 మద్యం సీసాలు సీఐ మారీదు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి బుధవారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.